

నాలుగున్నరేళ్ల జగన్ పాలనలో బటన్ నొక్కుడు తప్ప అభివృద్ధి ఊసే లేదు. ఉద్యోగాల భర్తీనే లేదు. దీనికి తోడు ఎనలేని పన్నుల భారం జనంపై బాదేశారు. నవరత్నాల పేరుతో బటన్ నొక్కుడు ద్వారా సంక్షేమం లబ్ధి కొంత మందికే చేకూరితే.. బాదుడు మాత్రం అందరిపై పడింది. వెరసి జగన్ పాలన అంటేనే బాదుడుగా మారిపోయింది. ఇక జీతాలు రాక ఉద్యోగులు, ఉపాధి లేక నిరుద్యోగులు పెరిగిన నిత్యావసర ధరలు.. ఇలా అన్నింటితో జగన్ సర్కారు జనాల్లో వ్యతిరేకత నింపుకుంది. ఈ నేపథ్యంలో టీడీపీ 'బాబు షూరిటీ మీ భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరిట ప్రతి గడప గడప తొక్కుతోంది. మహానాడులో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను టీడీపీ ఇంటింటికీ తీసుకెళుతోంది.



# జనంలోకి టీడీపీ



పులివెందులలో బీటెక్ రవి



కడపలో భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలను వివరిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఇన్‌చార్జి ఆర్.మాధవీరెడ్డి





కొండాపురంలో జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రచారం



ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే వరద, ఇన్‌చార్జి ప్రవీణ్ ప్రచారం



- బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ పేరిట ఇంటింటికీ
- చంద్రబాబు సీఎం అయితే సూపర్‌సిక్స్ పథకాలు అమలు
- కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో వివరిస్తున్న వైనం
- 19న కమలాపురంలో రా..కదలిరా.. బహిరంగసభ
- హాజరు కానున్న చంద్రబాబునాయుడు

(కడప-ఆంధ్రజ్యోతి): ఎన్నికల షెడ్యూలు ఫిబ్రవరిలో వెలువడుతుందనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో బాబుతో భవిష్యత్తుకు గ్యారంటీ ద్వారా ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించాలని టీడీపీ ప్రధానంగా నిర్ణయించుకుంది. చంద్రబాబు అరెస్టుతో వాయిదా పడ్డ ఈ కార్యక్రమాన్ని ఇటీవల ముమ్మరంగా చేపడుతున్నారు. 2019 ఎన్నికల్లో ఉమ్మడి వైఎస్సార్ కడప జిల్లాలో వైసీపీ పది అసెంబ్లీ, రెండు పార్లమెంటు స్థానాలను గెలుచుకుంది. అయితే ఈ సారి జగన్ అడ్డాలోనే టీడీపీ సత్తా చాటాలని చంద్రబాబు గట్టి పట్టుదలతో ఉన్నారంటారు. అందుకే కడపపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

## ఇంటింటికీ..

వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలిసి పోటీ చేయనున్నాయి. ఇరుపార్టీల నాయకులు భవిష్యత్తు గ్యారంటీ పేరిట ఇంటింటికీ వెళుతున్నారు. కడపలో పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి మాధవీరెడ్డి, జనసేన జిల్లా కోఆర్డినేటరు సుంకర శ్రీనివాసులు, టీడీపీ మాజీ ఇన్‌చార్జి అమీర్‌బాబు, అలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి తదితరులు భవిష్యత్తు గ్యారంటీపై ఇంటింటికీ వెళుతున్నారు. కమలాపురంలో పుత్తా నరసింహారెడ్డి, మైదుకూరులో పుట్టా సుధాకర్‌యాదవ్, బద్వేలులో టీడీపీ నేతలు విజయమ్మ, ఇన్‌చార్జి రోశన్న, రితీశ్‌కుమార్‌రెడ్డి తిరుగుతున్నారు. ఇక జమ్మలమడుగులో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు నారాయణరెడ్డి, శివనాథరెడ్డి.. పులివెందులలో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఇంటింటికీ వెళుతున్నారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, లింగారెడ్డి, ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సీఎం సురేశ్‌నాయుడు గడప గడప తొక్కుతూ టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తున్నారు.

## ఏ కుటుంబానికి ఎంత లబ్ధి అనేది వివరిస్తూ..

బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని టీడీపీ చాలా ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ సూపర్‌సిక్స్ పథకాలు పేద, మధ్యతరగతి, నిరుద్యోగులకు బాగా కనెక్ట్ అవుతున్నాయని చెబుతారు. చంద్రబాబు సీఎం అయితే మహాశక్తి పథకం ద్వారా మహిళల భవిష్యత్తు గ్యారంటీ పథకం అమలు చేయనున్నారు. ఆడబిడ్డ నిధి కింద ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమంది మహిళలకు ఒక్కొక్కరికి నెలకు రూ.1500, తల్లికి వందనం పేరిట చదువుకునే పిల్లలు ఎంతమంది ఉన్నా సరే ఒక్కో చదువుకునే పిల్లవాడికి ఏడాదికి రూ.15వేలు, దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి ఉచితంగా మూడు సిలిండర్లు, ఇక మహిళలకు ఉచితంగా బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించనున్నారు. మహాశక్తి పథకం మహిళలకు బాగా కనెక్ట్ అయిందని అంటున్నారు.

యువగళం పేరిట ఐదేళ్లలో 20 లక్షల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కల్పిస్తారు. యువగళం నిధి నుంచి నెలకు రూ.3వేలు నిరుద్యోగభృతి ఇస్తారు. ఇక అన్నదాతలకు ప్రతి యేటా ఒక్కొక్కరికి రూ.20వేలు ఆర్థికసాయం అందిస్తారు. ఇంటింటికీ మంచినీటి పథకం ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా నీరు ఇవ్వనున్నారు. బీసీలను అన్నివిధాలుగా ఆదుకోవడం, పేదలను సంపన్నులు చేసేందుకు పూర్ టు రిచ్‌తో ఐదేళ్లలో రెట్టింపు ఆదాయం తెచ్చేలా చేస్తామని హామీ ఇస్తున్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి చంద్రబాబు సీఎం అయితే అమలు చేసే సూపర్‌సిక్స్ పథకాలు వివరిస్తూ ఆ ఇంట్లో ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో లెక్కలు వేసి చెబుతున్నారు.

ఉదాహరణకు.. ఒక ఇంట్లో నలుగురు మహిళలు ఉంటే ఆడపడుచు నిధి కింద నెలకు వారందరికీ రూ.6వేలు, ఇద్దరు డిగ్రీ చదివిన పిల్లలు ఉంటే ఆ ఇద్దరికీ కలిపి రూ.6వేలు, చదువుకునే పిల్లలు ముగ్గురు ఉంటే వారందరికీ రూ.45వేలు, అన్నదాత కింద ఏడాదికి రూ.20వేలు చొప్పున మొత్తం ఐదేళ్లలో ఆ కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరుతుందో లెక్కలేసి బాబుషూరిటీ బాండ్లు అందిస్తున్నారు. ఇవన్నీ జనాలకు బాగా అర్థమయ్యే విధంగా వివరిస్తున్నారు. అదే సమయంలో జగన్ వేసిన బాదుడు, 9సార్లు కరెంటు చార్జీల పెంపు, బస్సు చార్జీలు, డీజలు, పెట్రోలు ఇలా అన్ని రకాల పన్నుల భారాన్ని వివరిస్తూ ముందుకెళుతున్నారు. ఫిబ్రవరిలోపే ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తు గ్యారంటీ ప్రచారం నిర్వహించాలని టీడీపీ భావిస్తోంది. ఒక విధంగా చెప్పాలంటే భవిష్యత్తు గ్యారంటీతో టీడీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది.

## 19న కమలాపురానికి చంద్రబాబు రాక

రా..కదలిరా.. పేరిట తెలుగుదేశం పార్టీ ప్రతి జిల్లాలో బహిరంగసభ నిర్వహిస్తోంది. అందులో భాగంగా ఈ నెల 19న కమలాపురంలో నిర్వహించే బహిరంగ సభకు టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు రానున్నారు. బహిరంగసభను భారీ సక్సెస్ చేయాలని టీడీపీ భావిస్తోంది. గత ఏడాది జిల్లాలో లోకేశ్ యువగళం పాదయాత్ర, చంద్రబాబు పులివెందుల టూర్ సక్సెస్ అయ్యాయి. ఎన్నికల ముందు కమలాపురంలో నిర్వహించే బహిరంగసభ ద్వారా పార్టీ శ్రేణుల్లో మంచి ఊపు తేవాలని టీడీపీ భావిస్తోంది.

## వైసీపీకి గడప గడపలో నిరసన

వైసీపీలో ప్రస్తుతం స్తబ్దత నెలకొంది. సామాజిక సాధికార బస్సు యాత్ర, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాలను చేపట్టినా అనుకున్నంత స్పందన జనాల నుంచి రాలేదు. కడప, మైదుకూరు, జమ్మలమడుగు, కమలాపురం, బద్వేలు నియోజకవర్గాల్లో గడప గడపలో స్థానికుల నుంచి నిరసన వ్యక్తమైంది. ప్రశ్నించే వారిపై కేసులు పెడుతుండడంతో కొందరు జనం సైలెంట్‌గా ఉంటున్నారు. ఎలాంటి అభివృద్ధి లేకపోవడంతో పాటు పన్నులు భారీగా మోదేయడంతో వైసీపీ నేతలు కలవరపడుతున్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత కొందరు వైసీపీ నేతలకు అర్థమవుతోంది. ఈసారి టీడీపీ గెలుస్తుంది చంద్రబాబునే సీఎం అనే చర్చ జనాల్లో నడుస్తుండడంతో వైసీపీ నేతలు ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీలో సిట్టింగ్‌లను మారుస్తున్నారు. మరి జిల్లాలో టికెట్ల మార్పు ఉంటుందా, సిట్టింగ్‌లను కొనసాగిస్తారా అనేది స్పష్టం కాకపోవడంతో దీనిపై ఆ పార్టీ వర్గాల్లోనే చర్చ నడుస్తోంది.

# 16 మంది ఎస్‌ఐల బదిలీ

కడప (క్రైం), జనవరి 10: జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో పనిచేస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొందరికి స్టేషన్లను కేటాయిస్తే మరికొందరు వీఆర్‌కు బదిలీ అయ్యారు. వీరు వెంటనే సంబంధిత స్టేషన్లలో రిపోర్టు చేసుకోవాలని ఎస్పీ ఆదేశాలు జారీచేశారు.

| పేరు | ప్రస్తుతం | బదిలీ | పేరు | ప్రస్తుతం | బదిలీ |
|---|---|---|---|---|---|
| తులసి నాగప్రసాద్ | కడప చిన్నచౌకు | రాజుపాలెం | వెంకటరమణ | బి.కోడూరు | కడప వీఆర్ |
| రాజగోపాల్ | రాజుపాలెం | కడప వీఆర్ | ఆర్‌వీ కొండారెడ్డి | కడప వీఆర్ | చాపాడు |
| చంద్రశేఖర్ | గోపవరం | తాళ్లప్రొద్దుటూరు | మొయినుద్దీన్ | చాపాడు | ముద్దనూరు |
| మోహన్ | తాళ్లప్రొద్దుటూరు | కడప వీఆర్ | చంద్రమోహన్ | ముద్దనూరు | కడప తాలుకా |
| హనుమంతు | తొండూరు | తలమంచిపట్నం | రామక్రిష్ణ | కడప తాలూకా | ప్రొద్దుటూరు టూటౌన్ |
| లక్ష్మీనారాయణ | వీఆర్ | తొండూరు | సురేశ్ | ప్రొద్దుటూరు టూటౌన్ | మైలవరం |
| గోపినాథరెడ్డి | తలమంచిపట్నం | కడప వీఆర్ | బీవీ క్రిష్ణయ్య | మైలవరం | కడప వన్‌టౌన్ |
| జయరాములు | కడప టూటౌన్ | బి.కోడూరు | హాజీవలి | పులివెందుల | కడప తాలూకా |

# మేడాకు.. మొండిచేయి



రాజంపేట సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మొండిచేయి చూపారు. గత వారంలో తాడేపల్లె ప్యాలెస్‌కు మేడాను పిలిపించుకుని.. టికెట్ నీకే.. వెళ్లి పనిచేసుకోమని ముఖ్యమంత్రి చెప్పినట్లు విస్తృతంగా ప్రచారం జరిగింది. మేడా అనుచరులు కూడా మూడవసారి ఎమ్మెల్యేగా గెలవబోతున్న మా నాయకుడు అంటూ.. ఇదే విషయాన్ని సోషియల్ మీడియా వేదికగా పంచుకున్నారు. అయితే బుధవారం సాయంత్రం మేడా సోదరులను తాడేపల్లె ప్యాలెస్‌కు పిలిపించిన జగన్.. మేడాకు టికెట్ ఇవ్వడం లేదని చెప్పినట్లు సమాచారం. ఈయనకు బదులుగా ఉమ్మడి కడప జిల్లా జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డికి టికెట్ ఇవ్వనున్నట్లు సమాచారం. దీని వెనుక రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. వారం రోజుల్లోనే మాట మార్చడంతో.. ఇదీ జగన్ మార్కు విశ్వసనీయత అంటే.. అని పలువురు పేర్కొంటున్నారు.

- మొన్న పనిచేసుకోమన్నారు.. నేడు వద్దన్నారు
- చక్రం తిప్పిన ఎంపీ మిథున్‌రెడ్డి
- ఇదీ జగన్ మార్కు విశ్వసనీయత..

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): 2014లో తెలుగుదేశం పార్టీ తరఫున జిల్లాలో ఏకైక ఎమ్మెల్యేగా మేడా మల్లికార్జునరెడ్డి గెలుపొందారు. ఆయనకు మంత్రి పదవి ఇవ్వనప్పటికీ.. చంద్రబాబునాయుడు వాళ్ల కుటుంబానికి మంచి గౌరవమే ఇచ్చారు. మేడ మల్లికార్జునరెడ్డి తండ్రిని టీటీడీ పాలకమండలి సభ్యులుగా నియమించారు. ఆ తర్వాత జరిగిన అనేక నాటకీయ పరిణామాల నేపథ్యంలో.. 2019 ఎన్నికల్లో మేడా మల్లికార్జునరెడ్డి వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఎందుకనో.. మొదటి నుంచీ రాజంపేట నియోజకవర్గంలో మేడాకు, ఎంపీ విథున్‌రెడ్డికి పొసగడం లేదు. పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే మేడాకు వ్యతిరేకంగా ఒకవర్గం పనిచేస్తూ ఉంది. దీని వెనుక ఎంపీ ఆశీస్సులు ఉన్నాయనే పుకార్లు ఉన్నాయి. నియోజకవర్గంలో కనీసం అధికారుల బదిలీల విషయంలో సైతం తమ నాయకుని మాట చెల్లుబాటు కాకుండా చేశారని ఎమ్మెల్యే మేడా వర్గీయులు ఆరోపిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో గత ఏడాది మేడా మల్లికార్జునరెడ్డికి వ్యతిరేకంగా గుర్తు తెలియని వ్యక్తులు నియోజకవర్గ వ్యాప్తంగా పోస్టర్లు వేశారు. కరపత్రాలు పంచి పెట్టారు. దీని వెనుక.. అధికార పార్టీలోని కొందరు పెద్దనాయకుల హస్తం ఉన్నట్లు సమాచారం. వీటన్నింటి నేపథ్యంలో ఈసారి ఎన్నికల్లో మేడాకు టికెట్ దక్కకపోవచ్చనే ప్రచారం సుమారు సంవత్సర కాలంగా ఉంది. అయితే గత వారంలో మేడా సోదరులను ముఖ్యమంత్రి తాడేపల్లె ప్యాలెస్‌కు పిలిపించుకుని మాట్లాడి.. పనిచేసుకోమని చెప్పడంతో.. వరుసగా మూడోసారి మేడా అసెంబ్లీ బరిలో ఉంటాడనే అందరూ అనుకున్నారు. ఆయన అనుచరులు సంబరాలు జరుపుకున్నారు. అయితే ముఖ్యమంత్రి మాట ఇచ్చి.. వారం కూడా గడకముందే.. మేడాకు మొండిచేయి చూపించారు.

## చక్రం తిప్పిన ఎంపీ మిథున్

రాయలసీమలో అభ్యర్థుల ఎంపికలో కీలక పాత్ర పోషిస్తున్న రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి ఎమ్మెల్యే మేడాకు టికెట్ విషయంలో చక్రం తిప్పినట్లు తెలిసింది. మేడా మల్లికార్జునరెడ్డికి ఇస్తే గెలవలేడు.. దీంతో తన గెలుపు కూడా కష్టం అవుతుంది.. కాబట్టి.. మేడాను మార్చాల్సిందేనని ముఖ్యమంత్రి వద్ద ఎంపీ గట్టిగా పట్టుబట్టినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి ఆయన సోదరుడు మేడా రఘునాథరెడ్డిలను ముఖ్యమంత్రి తాడేపల్లె ప్యాలెస్‌కు పిలిపించారు. చావు కబురు చల్లగా చెప్తూ.. అక్కడ మీరు గెలవలేరు.. మనకు గెలుపు ముఖ్యం.. నియోజకవర్గ ఇన్‌చార్జిగా జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డిని నియమిస్తున్నామని చెప్పినట్లు తెలిసింది. పార్టీ అధికారంలోకి వస్తే.. మేడా రఘునాథరెడ్డిని రాజ్యసభకు, మేడా మల్లికార్జునరెడ్డిని ఎమ్మెల్సీ చేస్తానని ముఖ్యమంత్రి చెప్పినట్లు సమాచారం. టికెట్ ఎవరికి ఇచ్చినా అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని ముఖ్యమంత్రి మేడా సోదరులకు సూచించినట్లు తెలిసింది. ప్రస్తుతానికి రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆకేపాటి అమరనాథరెడ్డిని నియమించినా.. ఎన్నికలనాటికి మరెన్ని మార్పులు జరుగుతాయో అని రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.





ఏడాది క్రితం ఎమ్మెల్యే మేడాకు వ్యతిరేకంగా వేసిన పోస్టర్లు



బద్వేలులో పొర్లుదండాలతో అంగన్వాడీల నిరసన



జమ్మలమడుగులో మెడలకు ఉరితాళ్లతో అంగన్వాడీలు

# అంగన్వాడీలకు షోకాజ్ నోటీసులు

- కొనసాగుతున్న ఆందోళనలు
- ధర్నాలు, మెడలకు ఉరితాళ్లు, పొర్లు దండాలతో నిరసన
- భిక్షాటన చేసిన మున్సిపల్ కార్మికులు

కడప, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీలు అమలు చేయాలంటూ 30రోజులుగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీల పట్ల జగన్ ప్రభుత్వం సానుకూలత చూపకుండా వారి సమ్మె భగ్నం చేయడమే లక్ష్యంగా ముందుకెళుతోంది. సచివాలయ సిబ్బంది ద్వారా బలవంతంగా కేంద్రాల తాళాలు పగలగొట్టి తెరిపించింది. అయినా అంగన్వాడీలు సమ్మె ఆపకపోవడంతో ప్రభుత్వం ఎస్మాను తీసుకువచ్చింది. అయినా అంగన్వాడీలు సమ్మె విరమించకపోవడంతో.. క్రమశిక్షణ చర్యలు ఉల్లంఘించినందుకు గాను మీపై ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ బుధవారం సంజాయిషీ నోటీసులు జారీ చేసింది. అయినా అంగన్వాడీలు జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగించారు. సుప్రీంకోర్టు తీర్పు, సమాన పనికి సమాన వేతనం, జగన్ ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలంటూ డిమాండ్ చేశారు. ఇక కడపలో కలెక్టరేట్ వద్ద, కొండాపురంలో దీక్షలు కొనసాగించారు. జమ్మలమడుగులో ఉరితాళ్లతో నిరసన తెలిపారు. ఐసీడీఎస్ అధికారులు తమకు ఫోను చేసి బెదిరిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బద్వేలులో పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు. పోరుమామిళ్లలో దీక్ష చేస్తున్న అంగన్వాడీలకు ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు రమణారెడ్డి, సుబ్రమణ్యం మద్దతు పలికారు. కడప కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టిన అంగన్వాడీలకు యూటీఎఫ్ లక్ష్మీరాజా తదితరులు మద్దతు తెలిపారు.

ఇక మున్సిపల్ కార్మికులు కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట, జమ్మలమడుగులో భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ప్రొద్దుటూరులో మోకాళ్లపై కూర్చుని ఆందోళన చేశారు. మైదుకూరులో ఆందోళన కొనసాగించారు. బద్వేలులో ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు.



జమ్మలమడుగులో భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు



ఎస్మాతో మా నోర్లు మూయించలేవంటూ ప్రొద్దుటూరులో మూతిమీద చేతులతో నిరసన



కడప కలెక్టరేట్ ఎదుట కొనసాగుతున్న ఆందోళన

# 13 నుంచి సురభి నాటకోత్సవాలు

పులివెందుల, జనవరి 10 : పులివెందులలో 13 నుంచి 18 వతేదీ వరకు సురభి నాటకోత్సవాలు జరగనున్నట్లు పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా పట్టణంలోని గరండాల రివర్ (రాణితోపు)లో ప్రఖ్యాత సురభి కళాకారులచే ఈ నాటకోత్సవాలు సాగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 6.30 నుంచి 8.30 వరకు నాటకాలు ప్రదర్శించనున్నారు. 13వ తేదీ శనివారం మాయాబజారు, 14న భక్తప్రహ్లాద, 15న పాతాళభైరవి, 16న శ్రీకృష్ణతులాభారం, 17న బాలనాగమ్మ, 18న శ్రీపద్మావతి శ్రీనివాస కల్యాణం నాటకాలు ప్రదర్శించనున్నారు. ఈ నాటకోత్సవాలను అందరూ విజయవంతం చేయాలని పాడా ఓఎస్డీ బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.



# కబ్జాల జోరు.. కనుమరుగవుతున్న వంకలు

● ఎక్కడికక్కడ నీటి ప్రవాహాలకు అడ్డుకట్ట ● యథేచ్ఛగా ఆక్రమణలు... నిద్రమత్తులో జోగుతున్న రెవెన్యూ అధికారులు

పులివెందుల రూరల్, జనవరి 10: అభివృద్ధి అంటే కొత్త రోడ్లు, కొత్త రంగులు, కొత్త భవనాలు, కొత్త పార్కులు నిర్మాణాలు సాగిస్తుండడం చూస్తుంటాం. అయితే ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం పులివెందులలో వంకలు, వాగులు కొల్లగొట్టడం కూడా అభివృద్ధిలో భాగమే అని నిరూపిస్తున్నారు పులివెందుల ప్రజాప్రతినిధులు, అధికారులు. భారీ వర్షాల కారణంగా వంకలు, వాగులు పొంగి ఊళ్లను చుట్టుముట్టి ప్రాణనష్టం, ఆస్తినష్టం జరుగుతుండడం, ఊర్లకు ఊర్లే కొట్టుకుపోతున్న సంఘటనలు మనం నేటికి చూస్తునే ఉన్నాం. అయితే భవిష్యత్‌లో కలిగే నష్టాలను పట్టించుకోకుండా నీటి ప్రవాహాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. స్వార్థ ప్రయోజనాలు, స్వార్థ రాజకీయాలకు మాత్రమే విలువనిస్తూ ఒకప్పుడు ఇక్కడ వంక ఉండేదని చెప్పుకొనేలా వంకలు, వాగులు లేకుండా చేస్తున్నారు. తప్పు చేస్తే చెప్పాల్సిన పాలకుల కనుసన్నల్లో జరుగుతుండడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల పట్టణంలోని కడప రోడ్డులోని సర్వే నెంబర్ 23లోని వంక కనుమరుగైపోయింది. మొన్నటి వరకు కనిపించిన వంక నేడు కనిపించక పోవడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ వంక వెలమవారిపల్లె, వెంకటాపురం (మున్సిపాలిటీలో విలీనం అయిన గ్రామాలు) యర్రగుడిపల్లె, బాకరాపురం మీదుగా ఇస్లాంపురం సమీపంలోని పెద్దవాగులో కలుస్తుంది. గతంలో వెలమవారిపల్లె పొలంలో కనుమరుగైన ఈ వంక నేడు పులివెందుల పట్టణం లోను కనుమరుగైంది. గతంలో ఎన్నోమార్లు కురిసిన వర్షాలకు బాకరాపురంలోని పలు ఇళ్లలోకి నీరు చేరిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇపుడు మిగిలిన వంక కూడా కనుమరుగై పోవడంతో వర్షం వచ్చినపుడు తిప్పలు తప్పవని ఆయా ప్రాంతాల ప్రజలు అంటున్నారు. దీనితో పాటు జేఎన్టీయూ వెనుక భాగంలో ఉన్న రెండు వంకలు కూడా కనుమరుగవుతున్నాయి. ఒకవైపు వంక ఉండగా మరో వైపు ప్లాట్లు ఏర్పాటుచేశారు. ఇలా వాగులు, వంకలను యథేచ్ఛగా ఆక్రమణలు చేసి మమల్ని ఆపేది ఎవరంటూ సవాల్ విసురుతున్నారు. పులివెందులలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కాస్తుండడంతో ఆక్రమణలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కళ్ల ముందు వంకలు కనుమరుగవుతున్న రెవిన్యూ యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులంటే పబ్లిక్ సర్వెంట్ అని కాకుండా పొలిటికల్ సర్వెంట్ అనేలా వ్యవహరిస్తున్నారని పలువురు ప్రజలు విమర్శిస్తున్నారు.





కడప రోడ్డులో గతంలో ఉన్న వంక... కడప రోడ్డులో ప్రస్తుతం కనుమరుగైన వంక





గతంలోనే వంకను కనుమరుగు చేసి నిర్మించుకున్న భవనాలు... పులివెందుల జేఎన్టీయూ వెనుక ఒకవైపు మాత్రమే కనిపిస్తున్న వంక

**పనులు నిలుపుదల చేశాం:** వంక పూడ్చిన విషయం వాస్తవమే. విషయం తెలిసిన వెంటనే ఆర్ఐ, సర్వేయర్, వీఆర్వోలు వెళ్లి పనులు నిలుపుదల చేయించాం.

- మాధవకృష్ణారెడ్డి, తహసీల్దార్, పులివెందుల

## తుగ్లక్ పాలనకు చరమగీతం పాడాలి

● టీడీపీ కడప ఇన్‌చార్జ్ మాధవీరెడ్డి, జనసేన జిల్లా కన్వీనరు సుంకర శ్రీనివాస్



బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో మాధవీరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), జనవరి 10 : రాష్ట్రంలోని తుగ్లక్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని టీడీపీ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆర్.మాధవీరెడ్డి, జనసేన జిల్లా కన్వీనరు సుంకర శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బుధవారం 5వ డివిజన్ అశోక్‌నగర్‌లో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. అలాగే వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై ప్రజలకు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన రోజురోజుకూ పెరిగిపోతోందన్నారు.అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ పాలనకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొమ్మలపాటి సుబ్బరాయుడు, సురేష్, చక్రి, జయశేఖర్, శివరాం, ఓబులేసు, సంపత్, శివకొండారెడ్డి, రవిశంకర్‌రెడ్డి, జిలానీ బాషా, సుబ్బరాయుడు, సుబ్బారెడ్డితో పాటు పలువురు జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## 'అధికారంలోకి రాగానే ఇంటింటికీ సంక్షేమం, అభివృద్ధి'



చెన్నూరులో బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నేతలు

చెన్నూరు, జనవరి 10:ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబుతోనే గ్యారంటీ అని, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాలంటే చంద్రబాబును సీఎం చేయాలని మండల కన్వీనరు కె.విజయభాష్కర్‌రెడ్డి, జిల్లా మైనార్టీ నాయకులు షబ్బీర్‌హుసేన్ అన్నారు. చెన్నూరు మైనార్టీ కాలనీ, పార్కు వీధి తదితరప్రాంతాల్లో బుధవారం బాబుతోనే భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధి పూర్తిగా అడుగంటిందని, సంక్షేమ పథకాలు కనిపించని ఫలాలయ్యాయని ఆయన తెలిపారు. అందుకే చంద్రబాబును సీఎం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మైనార్టీ కాలనీలు మరింత దారుణంగా ఇబ్బందులు పడుతున్నాయని అక్కడ ప్రజలు చివరికి రంజాన్ తోఫా కూడా అందుకోలేని పరిస్థితికి ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. అలాగే ఇటీవల క్రిస్మస్ పండుగ అయినప్పటికీ క్రిస్మస్ కానుకలు అందలేదని, రాబోతున్న సంక్రాంతి పండుగకు సంక్రాంతి కానుకలు లేవన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు ఈమూడు వర్గాలకు కానుకలు అందించి పండుగ పూట వారు సంతోషంగా గడిపేందుకు సహకారం అందించారన్నారు. ఇప్పుడు సహకారం సంగతి దేవుడెవురు వారంటేనే పాలకులకు వెటకారంగా ఉందన్నారు. ఈ బటన్ నొక్కుడు అంతా తిరిగి చార్జీలు, పెరిగిన దరలు రూపం, మద్యం రూపంలో లాక్కుంటున్నారని ఈ నొక్కుడుకు తగిన బుద్ధి చెప్పాలని వారు తెలిపారు. అలాగే సూపర్‌సిక్స్ వివరిస్తూ వాటి వల్ల కలిగే లబ్ధిని ఇంటింటా చెప్పడం జరిగింది. బలిజ సంఘం నేతలు జడ లక్ష్మీనారాయణ, అతికారి విశ్వం, మంజూరు అహ్మద్, గౌస్‌పీర్, జిలానీ, ఖాజాహుసేన్, పట్టణ అధ్యక్షుడు ఆకులచలపతి, బీసీ నాయకులు ఆటోబాబు, కుందేటి క్రిష్ణయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఖాళీగా ఉన్న అధ్యాపక ఉద్యోగాలను భర్తీ చేయాలి

● విద్యాశాఖ మంత్రికి ఏఐవైఎఫ్ వినతి



వినతిపత్రం అందిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 10 : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న జూనియర్, డిగ్రీ అధ్యాపక ఉద్యోగాలు భర్తీ చేయాలని, అలాగే మెగా డీఎస్సీ నిర్వహించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రావిడ సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడలో విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల ఏపీపీఎస్సీ ద్వారా జూనియర్ లెక్చరర్లు డీఎల్‌కు నోటిఫికేషన్ ఇచ్చారని అయితే జూనియన్ లెక్చరర్లు రాష్ట్రమంతా కేవలం 47 ఖాళీలు మాత్రమే చూపారన్నారు. గత నోటిఫికేషన్‌లో మిగిలిన తాజా ఖాళీలు భర్తీ చేపట్టలేదని, రాష్ట్రంలో ఉన్నఖాళీలన్నీ భర్తీ చేయాలన్నారు. అలాగే డిగ్రీ లెక్చరర్లకు సంబంధించి 240 ఖాళీలు నోటిఫికేషన్‌లో ఇచ్చారని, వాటిని భర్తీ చేయాలన్నారు.

## 'చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం'

కడప (ఎడ్యుకేషన్), జనవరి 10 : చంద్రబాబుతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్ తెలిపారు. బుధవారం కడప నగరం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి చంద్రబాబునాయుడే ముఖ్యమంత్రి కావాల్సిన ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. ఐటీ, ఉద్యోగ కల్పన, సాగు తాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలంటే అది చంద్రబాబుకే సాధ్యమని తెలిపారు. ప్రజలందరూ చంద్రబాబునాయుడు ఓటు వేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ నాయకులు నజీర్, హుసేన్, బాబయ్య, అజ్మతుల్లా పాల్గొన్నారు.

## యువత క్రీడారంగంలో రాణించాలి

వల్లూరు, జనవరి 10 : యువత క్రీడారంగంలో రాణించాలని టీడీపీ యువ నాయకులు పుత్తా క్రిష్ణ చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. సంక్రాంతి సందర్భంగా రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి సహకారంతో గురువారం అచ్చింతాయపల్లె ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండో బహుమతి రూ.30వేలు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని క్రికెట్ పోటీదారులు, యువత సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## సిద్దవటం సీతారామయ్య మృతికి నివాళి



సిద్దవటం సీతారామయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీ బ్రౌన్ ప్రతినిధులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 10 : పర్యాటక పితామహుడు సిద్దవటం సీతారామయ్య మృతికి సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సీకే సంపత్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సిద్దవటం సీతారామయ్య మృతికి సంతాప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంచాలకులు ప్రొఫెసరు రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సీతారామయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి అని, జిల్లా పర్యాటకాన్ని ప్రపంచ వ్యాప్తం చేసిన గొప్ప పరిశోధకులన్నారు. ఇంటాక్ సభ్యులు జిల్లా వైభవాన్ని చాటిచెప్పిన చరిత్రకారుడు సీతారామయ్య అన్నారు. సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో భాషా పరిశోధన కేంద్రం గ్రంథ పాలకులు హరిభూషణ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు వెంకటరమణ, మౌనికతో పాటు పలువురు పాల్గొన్నారు.

### వైసీపీ నుంచి టీడీపీలోకి

## 30 కుటుంబాలు చేరిక



పుత్తా సమక్షంలో టీడీపీలో చేరిన వారు

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్), జనవరి 10 :మండలంలోని నల్లింగాయపల్లెలో ఎర్రగుంట్ల ఓబుల్‌రెడ్డి, కర్నాటి రామచంద్రరెడ్డి ఆధ్వర్యంలో కొండాల హరికుమార్, చెన్నూరు మల్లారెడ్డి, మద్దల కేశవ, కొర్రపాటి రాజశేఖర్‌తో పాటు 30 కుటుంబాలు బుధవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానం పలికారు. అదే విధంగా గుట్టకింద అప్పాయపల్లె, సి.రాజుపాలెం గ్రామాల్లో నరసింహారెడ్డి పర్యటించారు. చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రతి ఇంటికి వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆయనతో పాటు పుత్తా చైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మిరెడ్డిలు , మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## క్రీడలతో మంచి భవిష్యత్తు

చెన్నూరు, జనవరి 10 : క్రీడలతో కూడా మంచి భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ అన్నారు. మండలంలోని కొండపేట, ఉప్పరపల్లెతో పాటు పలు పాఠశాలల్లో బుధవారం విద్యార్థులకు ఖోఖో, బ్యాడ్మింటన్, కబడ్డి, క్రికెట్‌లాంటి పోటీలు నిర్వహించారు. దాదాపు 1026 మంది విద్యార్థులు వివిధ పాఠశాలల నుండి ఇందులో పాల్గొన్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు శివ, రామసుబ్బారెడ్డి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసికోల్లాసం

వేంపల్లె, జనవరి 10 :క్రీడలతో శరీర దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని జడ్పీటీసీ సభ్యుడు రవికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఆటస్థలంలో మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహించారు. వివిధ రకాల ఆటల పోటీలు నిర్వమించి విజేతలకు బహుమతులు అందించారు. ఎంపీడీవో గిరిజ, ఎంపీపీ గాయత్రి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా ఉంటా

● టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సాయినాథ్‌శర్మ

కమలాపురం (కడప ఎన్టీఆర్ సర్కిల్ ), జనవరి 10 : కార్యకర్తలకు అండగా ఉంటానని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి సాయినాథ్‌శర్మ పేర్కొన్నారు. కమలాపురంలో బుధవారం మధ్యాహ్నం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 19న కమలాపురంలో నిర్వహించే 'రా. కదలిరా' బహిరంగ సభకు సమాచారమిచ్చి ఆహ్వానిస్తే ఖచ్చితంగా హాజరవుతానన్నారు.

## రక్త గ్రూపును ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి

కడప (మారుతీనగర్), జనవరి 10: రక్త గ్రూపును ప్రతి ఒక్కరూ విధిగా తెలుసుకోగలిగితే ఏదేని చికిత్స సమయంలో వైద్యసేవలు సులభతరం కాగలవని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు సూచించారు. జాతీయ యువజన దినోత్సవం (స్వామి వివేకానంద జయంతి) సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం స్థానిక ఒన్‌టౌన్ సమీపంలో గల ఆ కళాశాలలో ప్రాజెక్ట్ ఔషధ సమర్పణలో భాగంగా రక్త గ్రూపు నిర్ధారణ కార్యక్రమం నిర్వహించారు.

## అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలి

కడప (క్రైం), జనవరి 10 : ఎవరు కూడా అల్లర్లు కానీ, గొడవలు ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చూసుకోవాలని కడప టూటౌన్ 15 సెక్టార్ ఆఫీసర్, హెడ్‌కానిస్టేబుల్ రాము సూచించారు. తన సిబ్బందితో బుధవారం రాత్రి టూటౌన్ పరిధిలోని స్థానికులతో చర్చించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి ఘటనలు చూడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ఎవరైనా శాంతిభద్రతల పరిరక్షణకు భంగం కలిగిస్తే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ప్రాంతాల్లో ఏదైనా ఘటన జరిగితే తక్షణమే పోలీసులకు సూచించాలని కోరారు.

## ఎస్మా చట్టం రద్దు చేయాలి

● అంగన్వాడీ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి



సమ్మె నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కడప (నాగరాజుపేట), జనవరి 10: ఎస్మా చట్టాన్ని రద్దు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీదేవి డిమాండ్ చేశారు. బుధవారం కడప కలెక్టరేట్ ఎదుట ఐదో రోజు దీక్షలను ప్రారంభించారు. అనంతరం లక్ష్మీదేవి మాట్లాడుతూ అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 30 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా ప్రభుత్వం సమ్మల పరిష్కారం చేయకపోగా, అంగన్వాడీలకు వర్తించని ఎస్మా చట్టాన్ని అమలు చేయడం దుర్మార్గమన్నారు. తక్షణం జీఓ నెం.2 రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలు ప్రభుత్వ ఉద్యోగులు కాదని, గౌరవ వేతనంతో పనిచేస్తున్నారని, ఎస్మా చట్టం ప్రయోగించడం ఎంతవరకు సబబు అన్నారు. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్నారు. మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా మార్చాలని, 2017 నుండి టీఏ, డీఏ ఇవ్వాలని, తక్షణం వీటన్నింటికీ జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివకుమార్, సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి పి.వెంకటసుబ్బయ్య, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేసు, ఎస్ఎఫ్ఐ జిల్లాకార్యదర్శి సునీల్, ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి ఉద్దేమద్దిలేటి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, నగర ప్రధాన కార్యదర్శి అంజనీదేవి, దీప, వినీల తదితరులు పాల్గొన్నారు.

**అంగన్వాడీ టీచర్లు విధుల్లో చేరిక**

వేంపల్లె, జనవరి 10: అంగన్వాడీ టీచర్లు విధుల్లో చేరారని సీడీపీఓ సునీత తెలిపారు. 30 రోజుల వరకు నిరసన తెలిపిన అంగన్వాడీ ఉద్యోగులు ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడంతో విధి లేని పరిస్థితుల్లో బుధవారం సాయంత్రం విధుల్లో చేరినట్లు ఆవేదన వెలిబుచ్చారు.

## వైసీపీ అరాచక పాలనకు ముగింపు పలకండి

పులివెందుల టౌన్, జనవరి 10 :వైసీపీ అరాచక పాలన త్వరలో ముగింపు పడనుందని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి అన్నారు. బుధవారం పులివెందుల పట్టణంలోని పూల అంగళ్ల కూడలి నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి షాపుకు ప్రతి ఇంటికీ వెళ్లి టీడీపీకి పులివెందులలో ఒక అవకాశం కల్పించాలని కోరుతూ తనను గెలిపించండి అని అడుగుతూ ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాల్లో ప్రజల భవిష్యత్తుకు గ్యారంటీ చేకూరుతుందని తెలిపారు. నాలుగున్నరేళ్లుగా వైసీపీ అరాచక పాలన సాగించిందని దీనికి స్వస్తి పలికేందుకు ప్రజలు సిద్దంగా ఉన్నారని అన్నారు. కొన్ని రోజులుగా తను చేస్తున్న ప్రచారంలో ప్రజలు అనేక సమస్యలు తన దృషికి తెచ్చారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పులివెందుల అభివృద్ధికి చర్యలు చేపడతారన్నారు. టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిన మహిళా శక్తి, సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. పులివెందులలో టీడీపీ గెలిచేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనియాలన్నారు.

### 'టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేదిలేదు'

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 10 : టీడీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. బుధవారం కడప నగరం 2వ డివిజన్ స్థలం విషయంలో టీడీపీ కార్యకర్త హనుమంతును వైసీపీ కార్పోరేటరు అనుచరులు దాడి చేశారు. ఈ నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ న్యాయం కోసం ప్రశ్నిస్తే వైసీపీ గుండాలు దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్ఆర్ కాలనీలో కార్పోరేటరు వారి అనుచరులు టీడీపీ కార్యకర్త హనుమంతును కొట్టి బట్టలు చింపారని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయంపై చిన్నచౌకు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.




## అంజన్నకు రూ.50 వేలు విరాళం



విరాళం అందిస్తున్న పవన్‌కుమార్ కుటుంబ సభ్యులు

సికెదిన్నె, జనవరి 10: బయనపల్లె అభయ ఆంజనేయ స్వామి దేవస్థానానికి మాదాపవన్‌కుమార్ రాయల్ కుటుంబ సభ్యులు రూ.50 వేలు విరాళం అందించారు. ఆలయం పునఃనిర్మాణానికి గ్రామస్థులు కలిసికట్టుగా కృషి చేస్తున్న విషయం వారి దృష్టికి తీసుకుపోవడంతో వారు సానుకూలంగా స్పందించి ఆలయ పునర్నిర్మాణానికిగాను బుధవారం వారి కుటుంబ సభ్యుల సమక్షంలో వారి కీ.శే.రామయ్య, ధర్మపత్ని విజయగౌరి, కుమారులు పవన్‌కుమార్‌రాయల్, రెడ్డిరాయల్‌లు రూ.50 వేలు విరాళం ఇవ్వడం జరిగింది. వారి కుటుంబానికి స్వామివారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

## ఘనంగా ముందస్తు సంక్రాంతి వేడుకలు



భోగిమంటల కార్యక్రమంలో మహిళా డిగ్రీకళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్

కడప (ఎడ్యుకేషన్), జనవరి 10: కడప నగరం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనగా జరిపారు. కఆర్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపల్ సలీంబాషా ప్రారంభించారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎంతో ఆనందంతో రంగురంగుల ముగ్గులు అలంకరణతో పాటు హరిదాసు, గంగిరెద్దు, భోగికుండలను చెరుకుగడల చిత్రాలతో ముగ్గులు వేయచడమే కాకుండా ఆ ముగ్గులను అందమైన రంగులతో అలంకరించారు.అలాగే ముగ్గుల పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులను ప్రిన్సిపల్ అందించారు .చివరగా భోగి మంటలు వేసి పాటలు పాడి విద్యార్థులు, అధ్యాపకులు ఆనందంతో సంక్రాంతి నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మీదేవి, డాక్టర్ సతీదేవి, క్రిష్ణవేణి, నాగరత్నమ్మ, శ్రీనివాసులరెడ్డి, నాగమణిరెడ్డి, శ్రీరాములరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆర్తిహోంలో...** సంక్రాంతి సంబరాలను కడప నగరం ఆర్తిహోంలో ఘనంగా నిర్వహించుకున్నారు. సంక్రాంతిపండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు ఒదించారు. న్యాయనిర్ణేతలుగా రాజు భద్రావతి, డాక్టర్ మాధవీ, భాగ్యమ్మ ఎంపికలు చేసి ప్రథమ బహుమతిగా రూ.10 వేలు శ్వేతకు అందించారు. ద్వితీయ బహుమతి రూ.8 వేలు సుప్రజా, తృతీయ బహుమతి రూ.6వేలు వైష్ణవిలకు అందించడం జరిగింది. అలాగే ఐదు కన్సొలేషన్ బహుమతులు ఒక్కొక్కరికి రూ.1116 అందించారు.

# బయలు దేరిన శబరిమల యాత్ర

## బస్సులను ప్రారంభించిన గంటా చైత్ర



శబరిమల ఉచిత బస్సులను ప్రారంభిస్తున్న గంటా చైత్ర

రాజంపేట, జనవరి10: స్థానిక అయ్యప్పస్వామి ఆలయం నుంచి 90 మంది అయ్యప్ప భక్తులతో రెండు బస్సులు శబరిమలైకి బయలు దేరాయి. సుమారు ఆరు లక్షల రూపాయల ఖర్చుతో టీడీపీ నేత గంటా నరహరి ఏర్పాటు చేసిన బస్సులను ఆయన శ్రీమతి గంటా చైత్ర జెండా ఊపి ప్రారంభించారు. అయ్యప్ప స్వామి మాలధారులకు గంటా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అన్ని ఖర్చులు భరిస్తూ యాత్ర ఏర్పాటు చేశామన్నారు. రెండు బస్సుల్లో 7 రోజులు రానూపోనూ యాత్ర కొనసాగుతుందని ఆమె తెలిపారు. సంక్రాంతి సందర్భంగా అందరి ఇంటి ముంగిళ్లలో ముత్యాల ముగ్గులు వేసుకోవడానికి కావాల్సిన 10 రకాల రంగులు, ముగ్గుపిండిని ప్రత్యేక ప్యాకెట్ల ద్వారా ట్రస్ట్ తరపున పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, ఆర్యవైశ్య నేతలు సునీల్, ప్రసాద్, మహిళా నాయకురాలు ఉదయగిరి సౌందర్యలహరి తదితరులు పాల్గొన్నారు. అయ్యప్ప ఆలయంలో అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి ఉచిత బస్సులు ఏర్పాటు చేసిన చైత్రను వారు ఘనంగా సత్కరించారు.

# దౌర్జన్యంగా మొక్కలు పీకేశారు

● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



పొలంలో మొక్కలు తొలగించారని చూపెడుతున్న బాధితులు - మొక్కలు తొలగించిన దృశ్యం

వీరబల్లి, జనవరి10: సానిపాయి పంచాయతీ జింక హరిజనవాడకు చెందిన నాగమ్మ, రామక్క భూముల్లోని మామిడి మొక్కలను కుందేటివారిపల్లె వాసులు కుందేటి పాపయ్య, బాలయ్య దౌర్జన్యంగా తొలగించారని బాధితులు వాపోయారు. కొన్నేళ్లగా తమ అనుభవంలో భూమి ఉందని అందులో మామిడి చెట్లు కూడా నాటారని తెలిపారు. కాగా రెండు రోజుల కిందట భూముల్లోని 75 మామిడి మొక్కలను తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దార్, కలెక్టర్‌కు విన్నవించుకున్నా ఏ మాత్రం తమ పట్ల దయ కూడా చూపలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తాము ఎంతో నిరుపేదలమని, చిల్లిగవ్వ కూడా భూమిలేదని ఈ భూమి ఆధారంగా జీవిస్తున్నామన్నారు. వారు ఇలా పలుసార్లు తమపై దౌర్జన్యం చేస్తున్నారని సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని తమ అనుభవంలో ఉన్న భూమికి పట్టా ఇవ్వాలని తొలగించిన మామిడి చెట్లకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

# వెహికల్ బాడుగ ఇవ్వాల్సిందే

● ఆడుదాం ఆంధ్రాలో తంతు

ఖాజీపేట, జనవరి 10: ఆడుదాం ఆంధ్రాలో మొదటి రోజు నుంచి ఏదో ఒక తతంగం జరుగుతూనే ఉంది. బుధవారం 17 జట్లకు క్రికెట్ పోటీలు జరగాల్సి ఉండగా 16 జట్లకు పోటీలు నిర్వహించారు. ఇందులో ఖాజీపేట-1 పంచాయతీ గెలిచింది. కొత్తపల్లె బ్యాచ్‌ను గురువారం రావాలని ఎంపీడీఓ చెప్పడంతో వారు వెళ్లిపోయారు. సాయంత్రం అరగంట సమయం ఉందని, గెలిచి వెళ్లిపోయిన జట్టును తిరిగి రావాలని హుకుం జారీ చేశారు. అయితే వారు వాహనంలో గ్రౌండ్‌కు రాగా మరో బ్యాచ్ రాలేదని తిరిగి మీరు గురువారం రావాలని చెప్పడంతో ఎంపీడీఓతో ఖాజీపేట బ్యాచ్ గొడవకు దిగింది. మాకు వెహికల్ బాడుగ ఇవ్వాల్సిందేనని మొండిపట్టు పట్టడంతో ఎంపీడీఓ ఏమీ చేయలేక కొద్దిమేర నగదు చెల్లించినట్లు సమాచారం. ఏది ఏమైనా ఆడుదాం ఆంధ్రాపై అధికారులకు అవగాహన లేకపోవడంతో ఇలా జరుగుతోందన్న విమర్శలు వస్తున్నాయి.

# ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య

## పాపిరెడ్డిపల్లెలో విషాదఛాయలు



గంపా శ్రీనాథ్ (ఫైల్)

బ్రహ్మంగారిమఠం, జనవరి 10: పాపిరెడ్డిపల్లె వాసి గంపా వెంకటేశ్ కుమారుడు గంపా శ్రీనాథ్ (20) ఉరి వేసుకుని మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ విద్యాసాగర్ అందించిన వివరాల్లోకెళితే.... శ్రీనాథ్ డిగ్రీ వరకు చదివి, ఆర్మీ ఉద్యోగాల కోసం ఇటీవల ప్రయత్నం చేశాడు. ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. విషయం తెలుసుకున్న బి.మఠం ఎస్ఐ వారి బృందం సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి వివరాలపై ఆరా తీశారు. మృతుడు తండ్రి కూడా ఇటీ వలే మృతి చెందాడని తెలిపారు. మృతునికి తల్లి, సోదరుడు, సోదరి ఉందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని బద్వేలుకు తరలించినట్లు తెలిపారు.

# రాజారెడ్డి వీధిలో చోరీ

● రూ. 2లక్షల మేర బంగారం, వెండి నగల అపహరణ

కడప (క్రైం), జనవరి 10: కడప నగరం రాజారెడ్డి వీధిలోని ఓ ఇంట్లో దొంగలుపడి బంగారు నగలు, వెండి దోచుకెళ్లారు. రాజారెడ్డి వీధి వాసి అబ్దుల్లా గత నెల 24న కుటుంబ సభ్యులతో కలిసి బెంగళూరు వెళ్లారు. తిరిగి బుధవారం ఇంటికొచ్చారు. ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని వస్తువులు చెల్లాచెదురై ఉండడంతో బాధితుడు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ.240వేల విలువైన బంగారు, వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

# వాహనం సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం



వాహనం, ఎర్రచందనం దుంగలతో ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

పీలేరు, జనవరి 10: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తున్న వాహనం సహా 8 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్ఓ జేవీ సుబ్బారెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు మంగళవారం రాత్రి 10 గంటల నుంచి చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కొత్తపేట వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. బుధవారం ఉదయం 4 గంటలకు రొంపిచెర్ల వైపు నుంచి వేగంగా వచ్చిన ఏపీ39 హెచ్ఈ 1373 మహీంద్రా కారు ఆగకుండా ముందుకు వెళ్లిపోయిందన్నారు. దానిని వెంబడించగా గంగాధరనెల్లూరు మండలం కొత్త వెంకటాపురం వద్ద కారులోని వ్యక్తులు దానిని వదిలి పారిపోయారన్నారు. కారును తాము తనిఖీ చేస్తే అందులో 208 కేజీలు బరువున్న 8 ఎర్రచందనం దుంగలు లభించాయన్నారు. కారు సహా దుంగలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు. దాడిలో ఎఫ్ఆర్ఓ వెంకటరమణ, ఎఫ్‌బీఓ ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నట్లు ఆయన వివరించారు.

# 10 మంది కోడిపందెగాళ్లు అరెస్టు

ములకలచెరువు, జనవరి 10: కాలువపల్లె వద్ద కోడి పందెం శిబిరంపై దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. 10 మంది కోడిపందెగాళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ గాయత్రి తెలిపారు. వీరి నుంచి రూ.13,100 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ మనోహర్, సిబ్బంది కుమార్, వెంకటేశ్, సిరాజ్, హరి, అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

# అంతుచిక్కని తెగులు - ఎండుతున్న తోటలు

మందులు వాడినా ఫలితం శూన్యం ● దిగుబడుల్లో తోటలు ఇలా... ● ఆందోళనలో చీనీ రైతులు



తెగులు బారిన పడి పూర్తిగా ఎండిపోయిన చీనీచెట్టు

పులివెందుల, జనవరి 10: పులివెందుల ప్రాంతం చీనీతోటలకు పెట్టింది పేరు. ప్రధాన ఉద్యాన పంటగా చీనీ పంట సాగులో ఉంది. ఒక్కసారి సాగుచేస్తే దాదాపు 20ఏళ్లు ఆ పంట కొనసాగుతుంది. అటువంటి పంట అంతుచిక్కని తెగులుతో తోటలు నిలువునా ఎండిపోతున్నాయి. ఎండుతున్న తోటలు చూస్తే రైతు ఆందోళనకు గురవుతున్నాడు. ఏమి చేస్తే తోటలు దక్కుతాయో అర్థం కావడం లేదని రైతులు మదనపడుతున్నారు. వివరాల్లోకెళితే....

పులివెందులలో రైతులు విరివిగా చీనీ తోటలు సాగుచేస్తున్నారు. ఏడాదికేడాది సాగు పెరుగుతోంది. ప్రస్తుతం 25వేల నుంచి 30వేల ఎకరాల్లో చీనీ తోటలు సాగులో ఉన్నాయి. చీనీ అంటు నాటిన దగ్గరి నుంచి ఫలసాయం ఇస్తున్న తోటల వరకు వివిధ దశల్లో ఉన్నాయి. రెండుమూడేళ్లగా అంతుచిక్కని తెగులు రైతును కలచివేస్తోంది. రెండేళ్లగా ఈ తెగులు తోటల్లో కనిపిస్తున్నా అంత ప్రభావం లేదు. కానీ ఈ ఏడాది దాని ప్రభావం మరింత ఎక్కువై దిగుబడులు ఇచ్చే పెద్దపెద్ద చీనీచెట్లు సైతం నిలువునా ఎండిపోతున్నాయి. చెట్లు మొదలు దగ్గర నుంచి కొమ్మల వరకు చెట్టుకున్న తాట పొలుసులాగా ఊడిపోతోంది. చెట్టు కొమ్మల నుంచి పురుగు తొలిచేసిన పిప్పిడి రాలుతోంది. ఏ తోటలో చూసినా ఎక్కువ సంఖ్యలో చెట్లు ఈ తెగులు బారిన పడుతున్నాయి. ఎకరా పొలంలో వంద నుంచి నూటపది మొక్కలను సాగుచేస్తారు. ఐదేళ్ల పాటు దిగుబడులు లేకపోయినా వీటిని రైతులు పోషించాల్సిందే. అప్పటి వరకు తెగుళ్లబారిన తోటలు కూడా పడవు. దిగుబడులు ప్రారంభమైన తోటల్లోనే ఈ తెగులు ఎక్కువగా ఉంది. ఈ తెగులు పైన కనిపించకుండానే చెట్ల కొమ్మల్లో, మొదలు లోపల భాగాన పురుగు చేరి తొలుస్తోందని రైతులు వాపోతున్నారు. రెండేళ్లగా ఈ తెగులు ప్రభావం అంతంత మాత్రంగా ఉన్నా ఏడాదికేడాది పెరుగుతూ పోతుందేమోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలా తెగుళ్ల ప్రభావం పెరిగితే దిగుబడులు ఇచ్చే తోటలు నాలుగైదేళ్లలో పూర్తిగా తొలగించాల్సిందేనని రైతులు అంటున్నారు. పరిష్కారం చూపాలని ఉద్యాన శాఖ అధికారులను అడిగినా నివారణకు పలు మందులను పిచికారీ చేయమని చెబుతున్నారే కానీ వాటివల్ల ప్రయోజనం ఏమీ లేదని రైతులు అంటున్నారు. ఇదే అదునుగా పురుగుల మందుల వ్యాపారులు రైతులను దోచుకుంటున్నారు. ఈ తెగులుకు ఏ మందుపిచికారీ చేసినా ప్రభావం చూపడం లేదని రైతులు అంటున్నారు. అయిన కూడా దిగుబడులు ఇచ్చే చెట్లు కళ్లముందే ఎండిపోతోంటే చూడలేక ఏదొక మందు పిచికారీ చేస్తే చెట్లు బతుకుతాయోమోనని ఆశతో పులివెందుల ప్రాంత రైతులు తాడిపత్రి, అనంతపురం తదితర చోట్ల నుంచి అధిక ధరలు వెచ్చించి పురుగులమందులు తెచ్చి పిచికారీ చేస్తున్నారు. ఉద్యాన శాఖ ఈ తెగులు నివారణకు వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.



తెగులు బారిన పడడంతో ఎండుదశకు చేరుకున్న కాయలతో ఉన్న చీనీ చెట్టు - మొదలు నుంచి పురుగు తొలుచడంతో పిప్పిడి వస్తున్న దృశ్యం

# గొప్పవారిగా ఎదగాలి

## వనరులను సద్వినియోగం చేసుకుని




సమావేశంలో మాట్లాడుతున్న వైస్‌చాన్సలర్ - సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు

కడప (ఎడ్యుకేషన్), జనవరి 10: విశ్వవిద్యాలయ వనరులను సద్వినియోగం చేసుకుని గొప్పవారిగా ఎదగాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ పేర్కొన్నారు. వైవీయూ ఏపీజే అబ్దుల్‌కలాం ప్రాంగణంలో నూతన విద్యార్థులకు నిర్వహించిన పరిచయ ప్రేరణలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఒక ప్రత్యేకత కలిగిన విశ్వవిద్యాలయం వైవీయూ జాతీయ విద్యావిధానం 2020 అమలు చేస్తున్నామని జ్ఞాన నైపుణ్య, ప్రయోగ ఆధారిత విద్య అందిస్తున్నామన్నారు. విద్యార్థులంతా వైవీయూను ఎంపిక చేసుకోవడమే తమ ప్రగతి దశగా వెళుతున్నట్లు తెలిపారు. నేర్చుకోవడానికి ఉన్న అన్ని అవకాశాలు ఇక్కడ లభిస్తాయన్నారు. క్రమశిక్షణ, సమయపాలన పాటించాలని పోటీ ప్రపంచానికి తగ్గట్లు చదువులు, ఆలోచనలు సాగించాలన్నారు. గ్రంథాలయంలో వేల పుస్తకాలు జర్నల్స్ ఉన్నాయని నిపుణులైన అధ్యాపకుల, పరిశోధకుల సహకారం అందుకోవడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ సమాజ అవసరాలకు తగ్గ నైపుణ్యాలు అందించే బోధన శిక్షణ ఇక్కడ అందుతోందన్నారు. కడప జైళ్ల సూపరింటెండెంట్ ప్రకాశ్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో చదివే విద్యార్థులందరూ ఇక్కడి నుంచి ఉన్నత స్థాయిలోకి వెళ్లేలా రెండేళ్ల ప్రణాళికలు తయారు చేసుకుని అమలు చేసుకోవాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రొఫెసరు డాక్టర్ సరిత, సునీత, ప్రొఫెసరు రియాజున్నీసా, అణు ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

# శిల్పారామంలో సంక్రాంతి సంబరాలు

## 13నుంచి 16వరకూ నగర వాసులకు సందడి

## శిల్పారామం పరిపాలనాధికారి పి. శివప్రసాద్‌రెడ్డి



పాత్రికేయులతో మాట్లాడుతున్న శివప్రసాద్‌రెడ్డి

కడప (కల్చరల్) జనవరి 10: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని నగర రిమ్స్ సమీప శిల్పారామంలో 13వ తేదీ శనివారం నుంచి 16వ తేదీ మంగళవారం వరకూ (నాలుగురోజులు) సంక్రాంతి సంబరాలు పేరుతో కనువిందు చేసేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నట్లు శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్టేట్ గెస్ట్ హౌస్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రోజూ సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8-30 గంటల వరకూ భరతనాట్యం, కూచిపూడి, సినీ గీతాలు, జానపద నృత్య ప్రదర్శనలు, గంగిరెద్దులు, హరిదాసులు, తదితరాలను మిస్పా మూవీ సహకారంతో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. శనివారం ఉదయం 10 గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలు, ఆదివారం సాయంత్రం 4 గంటలకు గాలిపటాల పోటీలు, సోమవారం సాయంత్రం 5 గంటలకు సంప్రదాయ వస్త్రధారణ పోటీలుంటాయన్నారు. ఇందులో 3 నుంచి 8 ఏళ్ల బాల బాలికలు పాల్గొనాల్సి వుంటుందన్నారు. నగర వాసులు సంబరాల కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు తరలిరావాలని కోరారు. వివరాలకు 8886652038ను సంప్రదించాలని కోరారు. సమావేశంలో మిస్పా మూవీ పద్మాకర్, కొరియోగ్రాఫర్ రామ్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడు, మద్యం బాటిళ్లతో ఎస్ఐ

సింహాద్రిపురం, జనవరి 10: బిదినంచెర్లలో అక్రమ మద్యం అమ్ముతున్న ఒకరి నుంచి 10 మద్యం బాటిల్లు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో వెళ్లి అతన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే 9121100613కు తెలిపితే నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

# ఎద్దులబండి ఢీకొని వ్యక్తి మృతి



రవిరాజు ఫైల్ ఫొటో

రాజుపాలెం, జనవరి 10: తొండలదిన్నె వాసి గాలి పోతుల రవిరాజు (59) ఎద్దులబండి ఢీకొనడంతో మృతి చెందినట్లు ఏఎస్ఐ సిద్దయ్య తెలిపారు. తండ్రి భూషణంతో కలిసి పొలం పని నిమిత్తం బుధవారం రవిరాజు ద్విచక్రవాహనంలో వెళుతుండగా టంగుటూరు, తొండలదిన్నె గ్రామాల మధ్య ఎద్దులబండిని తప్పించబోయి రవిరాజు బండి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతునికి భార్య ఇద్దరు కుమారులున్నారు.

# విద్యుదాఘాతంతో రైతు మృతి



సిద్ధయ్య మృతదేహం

ముద్దనూరు,జనవరి10: కోనాపురం రైతు చెప్పలి సిద్ధయ్య(40) బుధవారం పొలంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందినట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. ఉప్పలూరు పొలంలో కూరగాయల పంటకు వ్యవసాయ బోరు వేసి నీళ్లు కడుతున్నాడు. ఉన్నట్లుండి మోటరు ఆగిపోవడంతో స్టార్టర్ వద్దకు వెళ్లి పరిశీలిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య హసీన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

# ప్రమాదవశాత్తు ....



పెద్దిరెడ్డి పుల్లారెడ్డి మృతదేహం

కలసపాడు, జనవరి 10: సిద్దమూర్తిపల్లెలో రైతు పెద్దిరెడ్డి పుల్లారెడ్డి (50) ప్రమాదవశాత్తు మృతి చెందాడు. పొలంలో బోరు బిగిస్తుండగా చైన్ పుల్లి విరిగి తల మీద పడడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో పోరుమామిళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈయనకు చంద్రహాసరెడ్డి అనే కుమారుడు, కుమార్తె, భార్య ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఘనమద్దిలేటి పరిశీలించి చేసి కేసు నమోదు చేశారు.

# పాతకక్షలతో వ్యక్తి దారుణ హత్య



ఓబులవారిపల్లె, జనవరి10: మండల కేంద్రంలో టీ బంకు వద్ద బుధవారం సాయంత్రం దారుణహత్య జరిగింది. కటికంవారిపల్లె వాసి కటికం చంటప్పగారి చెంగయ్య (50) పాతకక్షలు కారణంగా దారుణహత్యకు గురయ్యాడు. గాదెల రోడ్డుకు వెళ్లే సర్కిల్ వద్ద ఉన్న మర్రిచెట్టు ప్రాంతంలో టీ బంకు వద్ద నిత్యం రద్దీగా ఉంటుంది. చెంగయ్య టీ బంకు వద్ద ఉండగా అదును చూసి గుర్తు తెలియని దుండగులు వేట కొడవలితో దాడి చేయడంతో ఒకసారిగా కుప్పకూలిపోయాడు. ఊపిరితో ఉన్న అతన్ని పోలీసులు చికిత్స నిమిత్తం రాజంపేటకు తరలించినట్లు తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. భార్య బతు కుదెరువు కోసం గల్ఫ్‌దేశాల్లో ఉంది. మృతుడికి నిందితులకు పాతకక్షలు ఉండేవని గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేస్తామని ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

# స్థలవివాదంలో వ్యక్తిపై దాడి

కడప (క్రైం), జనవరి 10: వైఎస్ఆర్ కాలనీలో ఓ స్థల వివాదమై చలమారెడ్డిపల్లెకు చెందిన హనుమంతుపై వైసీపీ 2వ డివిజన్ కార్పొరేటరు అనుచరులు దాడికి పాల్పడ్డారు. గాయపడిన ఆయనను చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి బాధితులతో కలిసి చిన్నచౌకు స్టేషన్‌కు వచ్చి ఈ ఘటనపై సీఐ నరసింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కాగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# స్కూటర్‌ను ఢీకొన్న బస్సు

ఖాజీపేట, జనవరి 10: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు కాశినాయన ఆశ్రమం వద్ద ప్రైవేటు బస్సు స్కూటర్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్లితే... రోజూ బేల్దారి పనికి కడపకు వెళ్లి తిరిగి ఖాజీపేటకు వస్తుండగా పత్తూరు సమీపంలో స్కూటర్ రోడ్డు క్రాస్ అవుతుండగా ప్రైవేటు బస్సు ఢీకొనడంతో దుర్గం శివ, బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు.

# వేధింపుల కేసులో జైలుశిక్ష, జరిమానా

కడప (క్రైం), జనవరి 10: వరకట్నవేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలుశిక్ష, ఐదు వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చినట్లు చిన్నచౌకు సీఐ నరసింహారెడ్డి తెలిపారు. సీఐ వివరాల మేరకు కడప నెహ్రూనగరకు చెందిన అయూబ్‌ఖాన్‌కు 2018లో వివాహం జరిగింది. వివాహమైన కొన్ని ఏళ్ల వరకు అన్యోన్యంగా ఉన్నవారు అధిక కట్నం కోసం భార్యను వేధిస్తుండడంతో ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2021లో వరకట్న కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో న్యాయాధికారి సాక్ష్యాలు విచారించగా నేరం రుజువవడంతో ఏడాది జైలుశిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు తెలిపారు.

# దాడిపై కేసు నమోదు

కలకడ, జనవరి 10: బాలయ్యగారిపల్లి పంచాయతీ యర్రయ్యగారిపల్లిలో బుధవారం ఇద్దరిపై దాడి జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. సంబేపల్లి మండలం దిగువసోమవరం వాసులు నాగేంద్ర, చంద్రయ్యనాయుడు రోడ్డుపై నడుచుకుని వెళుతుండగా యర్రయ్యగారిపల్లికి చెందిన ఆనంద అతని భార్య శశికళ వారిని దూషించి గాయపరచినట్లు తెలిపారు. చంద్రయ్యనాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఆనంద నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ చెప్పారు.



**పాఠకులకు ముఖ్య గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

## ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్ తదితరులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 10 : సంక్రాంతి సంబరాల్లో భాగంగా శ్రీకృష్ణాలయంలో యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎస్ఐ హైమావతి యాదవ్, డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాలన్నారు. ఆలయ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ మాట్లాడుతూ సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి సుమలత, ద్వితీయ బహుమతి రామతులసి, తృతీయ బహుమతి ఈశ్వరి గెలుపొందారు. పాల్గొన్న వారికి కన్సోలేషన్ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గండి ఆంజనేయులు యాదవ్, రిటైర్డు టీచర్ సుబ్బరాయుడు, శ్రీనివాసులు యాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

## 'సైకో పోవాలి సైకిల్ రావాలి'

ప్రొద్దుటూరు ,జనవరి 10 :రాష్ట్రంలో సైకో పాలన పోవాలని సైకిల్ పాలన రావాలని ప్రజలు డిసైడ్ అయ్యారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. బుధవారం శివాలయం వీధి నందినీ క్లాత్ మార్కెట్‌లో బాబుష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో క్లాత్ మార్కెట్ అసోసియేషన్ నేతలు తిరుమలరెడ్డి , వైభవ్‌రామక్రిష్ణారెడ్డి యువకుమార్, రాఘవ,బ్రహ్మపద స్వామి,వేణుగోపాల్, వడ్డిబాలుడు, నరసింహులు, ఎర్రన్న, సోమా బాలయ్య, తలారి పుల్లయ్య, టప్పా బాషా, ఘంటశాల వెంకటేశ్వర్లు వంగల నారాయణరెడ్డి, గురివిరెడ్డి పాల్గొన్నారు.


## రాష్ట్రాభివృద్ధి కావాలంటే టీడీపీని గెలిపించండి

ప్రొద్దుటూరు ,జనవరి 10 : రాష్ట్రాభివృద్ధి కావాలంటే వచ్చే ఎన్నికల్లో టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పిలుపు నిచ్చారు. బుధవారం కొత్తమార్కెట్ పరిసరప్రాంతాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు విశ్వనాథరెడ్డి, మేరువ మూర్తి, తాటి శీను, సురేంద్ర , గుర్రప్పగంగాధర్, కరీముల్లా,శ్రీను, నూరి పుల్లయ్య, మధు పాల్గొన్నారు. కాగా వైసీపీ ప్రభుత్వం పై ప్రజలల్లో తీవ్ర వ్యతిరేకత వుందని వచ్చేది టీడీపీ ప్రభుత్వమే నని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డిసతీమణి మౌనికారెడ్డి పేర్కొన్నారు. బుధవారంస్థానిక కొత్తపల్లె పంచాయతీ సాయిరాజేశ్వరి కాలనీలో బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి సోదరి హరితా రెడ్డి, తాటి శ్రీను,భాగ్యమ్మ, ఓబులేసు, సుధాకర్ యాదవ్, కమాల్ బాషా పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం: భూపేశ్

కొండాపురం, జనవరి 10: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే సత్తా చంద్రబాబుకే ఉందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన కొండాపురం గ్రామంలో బుధవారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, గండ్లూరు నాగేశ్వరరెడ్డి, చామల లక్ష్మీప్రసన్న, టీడీపీ నాయకులు చామల విష్ణువర్ధన్ రెడ్డి,చామల బాబురెడ్డి,చామల శ్రీనివాసులరెడ్డి, గోరుశెట్టిబాబు, ఇందిరమ్మ, పద్మజ,గిరీష్ ,నారపురెడ్డి,శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీని సాగనంపండి: బొజ్జ రోశన్న



ప్రచారం చేస్తున్న బొజ్జ రోశన్న

పోరుమామిళ్ల, జనవరి 10 : వైసీపీ పాలనను సాగనంపి స్వచ్ఛమైన పరిపాలన అందివ్వనున్న సైకిలు గుర్తుకు స్వాగతం పలకాలని బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న అన్నారు. బుధవారం పోరుమామిళ్లలోని తంబాబావివీధి, బలిజ కోట తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యనమల సుధాకర్, టీడీపీ నాయకులు సీతా వెంకటసుబ్బయ్య, సీతాబాలాజీ, ఇమాంహుసేన్, శెట్టెం ప్రతాప్, జసింత, రామసుబ్బారావు, సత్యరాజ్, గిరి, గఫార్, కాశయ్య, నాగరాజు, కరీముల్లా, వెంకటేశ్వర్లు, అతికారి రాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న సతీమణి అరుణ రాజీ పంచాయతీ పరిధిలోని పలు ప్రాంతాల్లో టీడీపీ మేనిఫెస్టోలోని ఆరు పథకాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో హబీబున్నీసా, ప్రొఫెసర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## కొరపాటిపల్లెలో టీడీపీ ప్రచారం

పోరుమామిళ్ల, జనవరి 10 : పోరుమామిళ్ల మండలంలోని కొరపాటిప ల్లె పంచాయతీలోని కాల్వకట్ట, ఇందిరానగర్‌లో బద్వేలు టీడీపీ ఇన్‌ఛార్జ్ బొజ్జ రోశన్న, బాబుతో భవిష్యత్తుగ్యారంటీపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, సీతా వెంకటసుబ్బయ్య, టీడీపీ నాయకులు ముద్దం మల్లికార్జున, వెంకటేశ్వర్లు, అక్కిరెడ్డి, వల్లూరయ్య జయారం గౌడ్, వీరయ్య, పాణ్యం వెంకటసత్యం, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'రాజధాని లేని ఆంధ్రప్రదేశ్'

జమ్మలమడుగు, జనవరి 10: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్‌ను రాజధాని లేని రాష్ట్రంగా చేశారన్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పాముల బ్రహ్మానందరెడ్డి విమర్శించారు. బుధవారం జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

# 'ఎస్మా' తో అంగన్వాడీల నోర్లు మూయలేరు

ప్రొద్దుటూరు, జనవరి 10 : అంగన్‌వాడీలను భయపెట్టేందుకు ఎస్మాలాంటి చట్టం తీసుకురావరడంపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బుధవారం తహసీల్దారు కార్యాయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె 30 రోజులకు చేరుకుంది . ఈసందర్భంగా నోటికి రెండు చేతులు అడ్డంగా పెట్టుకుని నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాకార్యదర్శి సత్యనారాయణ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నేతలు సుబ్బలక్ష్మి, సునీత, రాణి, నిర్మల, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

### వచ్చేది టీడీపీ ప్రభుత్వమే అండగా వుంటాం : వరద

ప్రొద్దుటూరు , జనవరి 10 : వచ్చేది టీడీపీ ప్రభుత్వం అని అంగన్‌వాడీలు ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదని జగన్ ఎట్లా ఉద్యోగాలు ఊడగొడతాడో చూద్దాం అని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వదరాజులరెడ్డి అంగన్‌వాడీలకు భరోసా ఇచ్చారు. బుధవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన 30 రోజుల సమ్మెకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, వెంకటేశ్వర్లు,వడ్డిబాలుడు, సోమా బాలయ్య, తలారి పుల్లయ్య, టప్పా బాషా సూర్యనారాయణరెడ్డి , వంగల నారాయణరెడ్డి బచ్చలప్రతాప్ పల్లా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**జమ్మలమడుగు..:** జగన్ పాలన వద్దురా నాయనా అంటూ జమ్మలమడుగులో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ఉధృత స్వరంతో నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా 30వ రోజు బుధవారం ఐసీడీఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు అసోసియేషన్ నాయకులు, సీఐటీయూ, ఏఐటీయూసీ, సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దాసరి విజయ్, వినయ్‌కుమార్, సీపీఎం కార్యదర్శి యేసుదాసు, సీపీఐ కార్యదర్శి ప్రసాద్, అంగన్వాడీ అసోసిమేషన్ నాయకులు పాల్గొన్నారు.





ప్రొద్దుటూరులో అంగన్‌వాడీలకు మద్దతుగా మాట్లాడుతున్న వరదరాజులరెడ్డి , పోరుమామిళ్ల అంగ్వాడీ ధర్నాలో మాట్లాడుతున్న ఎస్టీయూ నేతలు

**కొండాపురం..:** మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు,ఆయాలు 30వ రోజు బుధవారం కొండాపురంలో తమ నిరసన ను కొనసాగించారు.జీతాలు పెంచి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు తారాదేవి,పద్మ,వరలక్ష్మి పాల్గొన్నారు.

**బద్వేలు రూరల్..:** అంగన్వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 30వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా అంగన్వాడీలు పొర్లుదండాలు పెట్టి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు నాయకురాళ్లు సుభాషిణి, హుసేనమ్మ , వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఖదీరయ్య, సత్యవతి, కళావతి, రాధమ్మ, జయప్రద, మహాలక్ష్మి, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

**పోరుమామిళ్ల..:** అంగన్వాడీలపై నిరంకుశత్వం తగదని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్లు రమణారెడ్డి, సుబ్రమణ్యం అన్నారు. బుధవారం పోరుమామిళ్ల తహసీల్దారు కార్యాలయం ఎదుట సమ్మె చేస్తున్న అంగన్వాడీ హెల్పర్స్‌కు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు క్రిష్ణారెడ్డి, రమణయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భైరవ ప్రసాద్, వెంకటరామయ్య, అబ్దుల్ హుసేన్, గురయ్య, పుల్లయ్య. ఆనంద్ పాల్గొన్నారు.



కొండాపురంలో ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

**మైదుకూరు..:** తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన ఆందోళనలు బుధవారం నాటికి 30వ రోజుకు చేరుకున్నాయి. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె వివిధ నిరసన కార్యక్రమాలతో కొనసాగుతున్నాయి. కాగా కడప కలెక్టరెట్ వద్ద చేపడుతున్న దీక్షలకు మైదుకూరు, దువ్వూరు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు తరలి అక్కడ దీక్ష చేపట్టారు.

## బైండోవర్ కేసులు నమోదు

అట్లూరు, జనవరి 10 : మండలంలోని ముతుకూరు, కోనరాజుపల్లె, మణ్యంవారిపల్లె, రెడ్డిపల్లె, కొండూరు, అట్లూరు, తంబళ్లగొంది గ్రామాలకు చెందిన వైసీపీ, టీడీపీ, బీజేపీకి చెందిన 67 మందిపై అట్లూరు తహసీల్దారు రవిశంకర్ సమక్షంలో ఇప్పటి వరకు బైండోవర్ కేసులు నమోదు చేయడం జరిగిందని అట్లూరు ఎస్ఐ కేసీరాజు తెలిపారు. ఎన్నికల ముందస్తు చర్యలకు ముందు జాగ్రత్తగా ఈ కేసులు నమోదు చేయడం జరుగుతోందని ఆయన తెలిపారు.

### కాశినాయనలో 100 మందిపై...

కాశినాయన జనవరి 10:మండలంలోని పలుగ్రామాలకు చెందిన 100 మందిపై బైండోవర్ కేసులు నమోదుచేసి తహసీల్దారు వద్ద హాజరుపరిచినట్లు ఎస్ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ సజావుగా ఎన్నికలు సాగే లా చూడటంలో భాగంగా ప్రతి గ్రామంలో కొంతమందిపై బైండోవర్‌కేసులు నమోదుచేస్తున్నామన్నారు.

## చాపాడు ఎస్ఐగా కొండారెడ్డి

చాపాడు, జనవరి 10: చాపాడు మండల కొత్త ఎస్ఐగా ఆర్‌వీ కొండారెడ్డిని ఎస్పీ సిద్ధార్థకౌశల్ బుధవారం నియమించారు. ఈయన అన్నమయ్య జిల్లాలోని రామాపురం మండలం ఎస్ఐగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ మైనుద్దీన్‌ను ముద్దనూరు మండలానికి బదిలీ చేశారు. కొండారెడ్డి గురువారం విధుల్లో చేరుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## 'జగన్ వెంటే నడుస్తా'

మైలవరం, జనవరి 10: ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెంటే నడుస్తానని మైలవరం మండలానికి చెందిన వైసీపీ నాయకురాలు అల్లె ప్రభావతి వెల్లడించారు. తమ కుటుంబం దివంగత నేత వైఎస్ హయాం నుంచి ఆ కుటుంబం వెంటే ఉన్నామన్నారు. జగన్ వైసీపీ స్థాపిస్తే ఆ పార్టీలోకి వచ్చామన్నారు. జగన్ వెంటే ఉంటామన్నారు. ఇతర పార్టీలోకి వెళ్లమన్నారు.

## పెండింగు బకాయిలు వెంటనే చెల్లించాలి

### ఆపస్ జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య

బద్వేలు రూరల్, జనవరి 10 : ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులకు పెండింగులో ఉన్న డీఏ, పీఆర్సీ పీఎఫ్, ఏపీజీఎల్ఐ సరెండరు లీవు తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) జిల్లా అధ్యక్షుడు శెట్టెం చెన్నయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పోరుమామిళ్ల రోడ్డులో ఉన్న సరస్వతీ శిశు మందిర్‌లో ఆపస్ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆపస్ నూతన కార్యవర్గ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆపస్ మాజీ జిల్లాఅధ్యక్షుడు రామకోటి రాజు, జిల్లా కార్యదర్శి జనార్ధన్‌రాజు, కేశవరెడ్డి తిరుమలరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

## వేతన సవరణ తక్షణమే చేపట్టాలి

జమ్మలమడుగు, జనవరి 10: జమ్మలమడుగు పట్టణంలో ఎల్ఐసీ కార్యాలయం ఎదురుగా కార్యాలయ సిబ్బంది బుధవారం మధ్యాహ్నం నిరసన తెలిపారు. దేశవ్యాప్తంగా ఎల్ఐసీ కార్యాలయాల వద్ద భోజన విరామ సమయంలో ఒక గంట సమ్మెలో భాగంగా సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఎల్ఐసీ యాజమాన్యం సంస్థలో వేతన సవరణ తక్షణం చేపట్టాలని సిబ్బంది సంఘాల జాయింట్ ఫ్రంట్ నాయకులు వెంకటరామిరెడ్డి, ఆదినారాయణ, ఎం.నరసింహులు, యూనియన్ అధ్యక్షుడు వైక ల్యాబ్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ల నాయకులు పాల్గొన్నారు.

## ప్రొద్దుటూరు ఈఆర్‌వో గా చంద్రమోహన్

ప్రొద్దుటూరు, జనవరి 10 : ప్రొద్దుటూరు అసెంబ్లీ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి (ఈఆర్‌వో)గా తెలుగు గంగ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రమోహన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషన్ నియమించింది. ఆమేరకు బుధవారం ఆయన ప్రొద్దుటూరు తహసీల్దారు కార్యాలయం వచ్చి బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఈఆర్‌వో జీఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామ్మోహన్‌పై టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి జాతీయ ఎన్నికల కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఓటరు లిస్టులో అవకతవలు జరిగాయని విచారించి ఆయనపై ఎన్నికల కమిషన్ సస్పెన్షన్ వేటు వేసిన విషయం విధితమే.

## ప్రభుత్వం సమస్యలు పరిష్కరించాలి

జమ్మలమడుగు, జనవరి 10: ప్రభుత్వం తమ డిమాండ్లను తీర్చాలని జమ్మలమడుగు-ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ లైన్ల మధ్య పనిచేసే సిబ్బంది రైల్వేస్టేషన్ ఆవరణలో బుధవారం ఉదయం 9 గంటలకు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. రిలే నిరాహార దీక్షలో వైస్‌చైర్మన్లు పి.ఓబులేసు, ఇ.వెంకటనారాయణ, వర్కింగ్ సెక్రటరీ సురేష్‌బాబు, దస్తగిరిరెడ్డి, కామ్రేడ్స్ సయ్యద్ మహమ్మద్, బి.కిశోర్‌బాబు, ఎస్.దాదాపీర్, బబ్లురాం, విక్రమ్, ఆశారాం, పవన్‌కుమార్, సీహెచ్ జగన్, సిద్ధార్థరెడ్డి, శ్రీనివాసులు, చైతన్య, నాగేంద్ర రిలే దీక్షలో కూర్చున్నారు.

## పథకాలపై కేలండర్ ఆవిష్కరణ




బ్రహ్మంగారిమఠం, జనవరి 10 : కేంద్రం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై బీజేపీ నేతలు కేలండర్ ఆవిష్కరించారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదుకూరు నియోజకవర్గం బీజేపీ అధ్యక్షుడు మాచునూరు సుబ్బరాయుడు పర్యవేక్షణలో క్యాలెండరును ఆవిష్కరించారు. అనంతరం ఇటీవల ప్రవేశపెట్టిన ఏటాకుటుంబానికి ఐదు లక్షలవిలువైన బీమా కార్డులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో బీమఠం మండల అధ్యక్షుడు సి.వీరనారాయణరెడ్డి, ఎంపీడీవో వెంగమునిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బాలక్రిష్ణయాదవ్, బీజేపీ మైదుకూరు మండల అధ్యక్షుడు రామక్రిష్ణ, బ్రహ్మంగారమఠం బీజేపీ అధ్యక్షుడు చంద్ర ఓబుల్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు ఈశ్వరయ్య, బీజేపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.

## నగరవనాల అభివృద్ధితోనే ఆరోగ్యం

ప్రొద్దుటూరు ,జనవరి 10 : పట్టణాలు నగరాల్లో కాలుష్యం రోజు రోజుకు పెరిగిపోతోందని నగరవనాలు అభివృద్ధి చెందితేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని సబ్‌డివిజనల్ ఫారెస్టు అధికారి దివాకర్ పేర్కొన్నారు. బుధవారం ఎర్రగుంట్లరోడ్డులోని రాజీవ్ నేషనల్ ఏకో పార్కులో 500 మొక్కల ఏర్పాటుకు వాటిని పెంచడానికి అవసరమైన నీటి సదుపాయం కోస డ్రిప్ సౌకర్యానికి డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి 1.08 లక్షల ఆర్థిక సహాయం చెక్కు రూపంలో అందజేశారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ అధికారి హేమాంజలి, డిప్యూటీ రేంజ్ అధికారి రవిచంద్ర పాల్గొన్నారు.

## 80 కుటుంబాలు టీడీపీలో చేరిక



పలువురిని పార్టీలోకి చేర్చుకుంటున్న పుట్టా సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్, జనవరి 10 : మాజీ జడ్పీటీసి అవిలి శ్రీదేవితో పాటు దాదాపు 80 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ బుధవారం సాయంత్రం మండలంలోని సోమయాజుపల్లెకు చెరుకొని వైసీపీకి చెందిన శీర్ల నాగసుబ్బయ్య, అవిలి రామక్రిష్ణ, పోలయ్య, మురళీ, ఆంజనేయులు వారి అనుచరుల దాదాపుగా 80 కుటుంబాల వారిని ఆయన పార్టీ కండువ కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు భీమయ్య, రామచంద్రనాయుడు, శీర్ల నాగమోహన్, కొండపల్లి ఉమాకాంత్, చంద్ర ఓబుళరెడ్డి, జనసేన నాయకుడు మల్హోత్ర తదితరులు పాల్గొన్నారు.

## బాబుతోనే భవిష్యత్తు గ్యారెంటీ

అట్లూరు, జనవరి 10 : మండలంలోని మన్యంవారిపల్లె గ్రామంలో బుధవారం బాబుషూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కరపత్రాలు ఇంటింటికీ అందించారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు పి.మల్లికార్జునరెడ్డి,మండల మాజీఅధ్యక్షుడు మన్యం మహేశ్వర్‌రెడ్డి, అల్లం వెంకటసుబ్బయ్య, మన్యంరామసుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.


## ఆత్మీయ సమ్మేళనం



1992-95 డిగ్రీ బ్యాచ్ ఆత్మీయ సమ్మేళనం

జమ్మలమడుగు, జనవరి 10: జమ్మలమడుగు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1992-95 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం జమ్మలమడుగు నాగులకట్టలోని శ్రీచౌడేశ్వరీదేవి కల్యాణ మండపం ఆవరణలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత ప్రిన్సిపాల్ బాలచంద్రారెడ్డి మాట్లాడుతూ అందరూ ఆనందంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, ఆరోగ్యమే మహా సంపద, ఆనందమే ఆరోగ్యమని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహకులు తిప్పాబతిని వెంకటసుబ్బయ్య, అనంతరామ్, రమేష్, అబ్దుల్ బషీర్, రమణయ్య, బాబాసాహెబ్, జరీనాబేగం, సుబ్బరత్న, తదితరులు పాల్గొన్నారు.

## యువత అభివృద్ధి కోసమే యువజన పార్టీ



మాట్లాడుతున్న డేవిడ్

పోరుమామిళ్ల, జనవరి 10 : పేద ప్రజలు, యువత అభివృద్ధి కోసమే అవతరించిన పార్టీ భారత చైతన్య యువజన పార్టీ అని ఆ పార్టీ నాయకుడు ఆ పార్టీ ఇన్‌ఛార్జ్ డేవిడ్ అన్నారు. బుధవారం పోరుమామిళ్ల నుంచి అనంతపురంకు భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న సమావేశానికి కార్యకర్తలతో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గంలో భారత చైతన్య యువజన పార్టీ కూడా పోటీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో పోరుమామిళ్ల పరిసర ప్రాంత యువకులు పాల్గొన్నారు.



# వినూత్నరీతిలో మునిసిపల్ కార్మికుల నిరసన

భిక్షాటన చేస్తూ, మోకాళ్లపై నిలబడి, ఒంటికాలిపై, పొర్లుదండాలు పెడుతూ సమ్మె చేస్తున్న మునిసిపల్ సిబ్బంది

ప్రొద్దుటూరు , జనవరి 10 : తమ డిమాండ్లను పరిష్కరించటంలో ప్రభుత్వం ముందుకు రాకుండా బెదిరింపుల ధోరణితో వ్యవహరించటం తగదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చంటి, కార్యదర్శి సాల్మన్ హితవు పలికారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు మోకాళ్లపై నిలబడి జగన్ నీకో దండం పేర నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి రాఘవ, ఉపాధ్యక్షురాలు గుర్రమ్మ, నీతమ్మ, ప్రమీల, రమాదేవి పాల్గొన్నారు.

**జమ్మలమడుగు..:** మున్సిపల్ వర్కర్లు బుధవారం 16వ రోజు నిరసన కార్యక్రమంలో భాగంగా భిక్షాటన నిర్వహించారు. ముందుగా జమ్మలమడుగు మున్సిపాలిటీ మస్టర్ పాయింట్ వద్ద నిరసన తెలిపారు. అక్కడి నుంచి పాత బస్టాండులో దుకాణాల వద్దకు వెళ్లి భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు దాసు, విజయ్, మున్సిపల్ వర్కర్లు శివన్న, చెన్నయ్య, నటరాజు, మైఖేల్, గంగాధర్, పుల్లయ్య, గ్రేసమ్మ, జయలక్ష్మి, తిరుపాళమ్మ, సుశీలమ్మ,పుల్లమ్మ, సుగుణమ్మ పాల్గొన్నారు.

**బద్వేలు..:** మునిసిపల్ కార్మికులు ఒంటికాలిపై నిలబడి తమ నిరసన తెలిపారు. కార్మికుల సమ్మె 16వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు జగనన్న హామీలు అమలు చేయాలని కోరుతూ ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు.కార్యక్రమంలో యూనియన్ పట్టణ కోశాధికారి కె.శివకుమార్, పులిశ్యాం, ప్రవీణ్, హరి, నాగేంద్రబాబు, పోలయ్య, చంద్రశేఖర్, రామయ్య పాల్గొన్నారు.

**మైదుకూరు..:** తమ సమస్యలు పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్మికులు బుధవారం మొక్కు దండాలు పెడుతూ నిరసన ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో వెంకట సుబ్బయ్య, కళ్యాణ్, చిన్న, సతీష్, మహేంద్ర, విశ్వనాద్ తదితరులు పాల్గొన్నారు.







మైదుకూరులో మొక్కుతున్న, బద్వేలులో ఒంటికాలిపై, ప్రొద్దుటూరులో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న మునిసిపల్ కార్మికులు